ప్రజాశక్తి
శుక్రవారం 11 అక్టోబర్ 2024
5
శ్రీ సత్యసాయి

'పల్లె పండుగ' వారోత్సవాలను

విజయవంతంగా నిర్వహిద్దాం

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో పండుగ వాతావరణంలో పల్లె పండుగ – పంచాయతీ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ పేర్కొన్నారు. గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్లోని కోర్టు హాల్లో ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమం నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రామస్థాయిలో నిర్వహించే పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకుని విజయవంతం చేయాలన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలో ఈ సంవత్సరంలో చేసే అభివద్ధి పనులకు సంబంధించి ఆ గ్రామంలో బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్ శాఖల ద్వారా గ్రామస్థాయిలో వందకు వంద శాతం పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పంచాయతి సెక్రటరీలు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులను పూర్తిచేయాలన్నారు. భూమిపూజ చేసే వాటికి సంబంధించి పంచాయతీల్లో ప్రచారం చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులను కలుపుకుని ఈ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో 436 గ్రామపంచాయతీల్లో డిడబ్ల్యూఎంఎ ఆధ్వర్యంలో 1152 పనులకు రూ.78 కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. అధికారులు పక్కా ప్రణాళికతో ఈ పనులు చేసేలా ముందుకు సాగాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిపిఒ సమత, డిడబ్ల్యూఎంఎ పీడీ విజయేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి - తలుపుల

మండల కేంద్రంలో పారిశుధ్యం పడకేసింది. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం ఎదుట రోడ్డుపైనే చెత్త చెదారం పేరుకుపోయింది. కూరగాయల వ్యాపారస్తులు మటన్ వ్యాపారస్తులు రోడ్ల పైన ఎక్కడపడితే అక్కడ నీటిని చెత్తను వేసి ప్రజలను ఇబ్బందులు గురి చేస్తున్నారు. చెత్తతో దోమలు వృద్ధి చెందిన చుట్టుపక్కల ప్రాంతాల వారు అనారోగ్యం పాలవుతున్నారని మాజీ వార్డు సభ్యులు చంద్ర , సామ్రాట్ సుబ్బయ్య, నరసయ్య, సుబ్బన్న మహబూబ్ బాషా వాపోతున్నారు. తలుపుల మేజర్ పంచాయతీలో పరిస్థితి ఇలా ఉంటే ఇక గ్రామాల్లో ఎలా ఉంటుందో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పండుగపూట ధరలమ(వ)ంట

◆ సెంచరీకి చేరువలో టమోటా

◆ పరుగులు పెడుతున్న వంట నూనెలు

◆ కూరగాయలు, నిత్యావసరాల అన్ని ధరలూ అధికమే

దసరా పండగ వేళ నిత్యావసరాలు, కూరగాయల ధరలు ఆకాశానంటుతున్నాయి. సామాన్యుడు ఏదీ కొనలేని పరిస్థితి నెలకొంది. ఏ దుకాణానికి వెళ్లినా ధరల భారం తప్పడం లేదు. అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. కాయగూరలు, ఆకుకూరలు, నూనెలు, మాంసం, పప్పుల ధరలు అమాంతం పెరిగాయి. ప్రతి నిత్యావసర వస్తువు ధరా రూ.10 నుంచి రూ.20 వరకు పెరిగింది. వంట నూనెలు అయితే ఏకంగా రూ.50 వరకు పెరిగాయి. దీంతో సామాన్యుడి పండుగ పూట ఏదీ కొని పిండవంటలు చేసుకుని తినే పరిస్థితి కన్పించడం లేదు.



ప్రజాశక్తి-హిందూపురం

నిత్యావసర ధరలు ఊహించని రీతిలో పెరిగాయి. పక్షం రోజుల కిందట లీటర్ నూనె ధర రూ.20 నుంచి 45కు పెరిగింది. గతంలో రూ.110 ఉన్న నూనె ప్యాకెట్ ధర రూ.140కి చేరుకుంది. వెల్లుల్లి దిగిరానంటూ రూ.400పైనే ఉంది. టమోటో సెంచరీకి చేరువలో ఉంది. కిలో చికెన్ రూ.240కి చేరువైంది. ఉల్లి ధర నెల రోజులుగా కిలో రూ.70కిపైగానే పలుకుతోంది. వెల్లుల్లి రూ.400కి పెరిగింది. అల్లం కిలో రూ.180 వరకు ఉంది. ఎండు మిరపకాయల ధర సైతం పెరిగాయి. అన్ని రకాల పప్పుల ధరలు కిలో రూ. 20 నుంచి 30కు పైగానే పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం నూనె ధరలపై ఎక్సైజ్ సుంకం 12 నుంచి 32 శాతానికి పెంచడంతో నూనె ధరలు ఒక్కసారిగా పెరిగాయి. పూజకు ఉపయోగించే నువ్వుల నూనె నుంచి వంట నూనెల ధరలు కంపెనీని బట్టి కిలోకు రూ.20 నుంచి రూ.40 వరకు పెరిగాయి. వివిధ రకాల పప్పుల మీద కిలోకి రూ.20 నుంచి రూ.40 వరకు ధరలు పెరిగిపోయాయి. బియ్యం కూడా భారీగా పెరిగాయి. మేలు రకం బియ్యం 25 కిలోలు రు.1700 నుంచి రూ.1850 పెరిగాయి. కూరగాయల విషయానికొస్తే వారానికి సరపడా కూరగాయలు మార్కెట్లో కొనాలంటే కనీసం రూ.500 ఖర్చు చేయనిదే బుట్టనిండడం లేదు. ఎర్రగడ్డలు, టమోట ధరలు ఆకాశానంటాయి. నాణ్యతను కిలో బట్టి రూ.50 నుంచి రూ.80 వరకు ఎర్రగడ్డలు, టమోటాలు ధరలు పలుకుతున్నాయి. బహిరంగ మార్కెట్లో కూరగాయల ధరలు పరిశీలిస్తే కిలో.. ఎర్రగడ్డలు రూ.70, టమోట రూ.90, బంగాళదుంపలు రూ.45, బీన్స్ రూ.80, క్యారెట్ రూ.60, చామగడ్డలు రూ.80, మునగకాయలు రూ. 60, చిక్కుడు కాయలు రూ. 60, బీరకాయలు రూ.50, అనపకాయలు రూ.50, అలసందలు రూ.50, కాకర కాయలు హైబ్రేడ్ రూ.40, నాటి రూ.45, దొండకాయలు రూ.50, ముల్లంగి రూ.40, కాప్సికం రూ.55, బీట్రూట్ రూ.40, అల్లం రూ.160, క్యాలీఫ్లవర్ రూ.45, క్యాబేజీ రూ. 50, వంకాయలు రూ.30, బెండకాయలు రూ.40, సొరకాయ రూ.30, బజ్జిమిరపకాయలు రూ.50 ధరలు పలుకుతున్నాయి.

పేదోళ్లు ఎలా బతకాలి

హోల్సేల్ మార్కెట్లోనూ ధరలు పెరిగాయి. ఇక వీధుల్లో ఉండే దుకాణ యజమానులు ధరలు భారీగా పెంచి అమ్ముతున్నారు. కూరగాయల ధరలు కూడా అమాంతంగా పెరిగాయి. ప్రభుత్వం పేదలను దృష్టిలో ఉంచుకుని ధరలు తగ్గించే మార్గాలు ఆలోచించాలి.

సుమంగళి, గృహిణి హిందూపురం.

ధరలను నియంత్రించాలి

నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇటీవల అన్ని రకాల వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ధరల నియంత్రణకు వెంటనే చర్యలు తీసుకోవాలి. నూనెపై ఎక్సైజ్ సుంకం గతంలో 12 శాతం ఉంటే 32 శాతానికి పెంచడంతో నూనె ధరలు అమాంతం పెరిగాయి. మోడీ సర్కారు ఎన్నికల సమయంలో ధరలు తగ్గించి ఆ తర్వాత పెంచుతూ ప్రజలపై భారం మోపుతోంది.

సుబ్బిరెడ్డి,
ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

హెచ్ఎల్ఎంసికి రూ.35 కోట్లు అవసరం

◆ అధికారుల అంచనా ◆ ప్రభుత్వం నిధులు విడుదల చేసేనా..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాకు ఏకైక నిఖర జలవనరులున్న ప్రాజెక్టు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ (హెచ్ఎల్ఎంసి). 70 సంవత్సరాల క్రితం చేపట్టిన ఈ ప్రాజెక్టు నిర్వహణ రోజురోజుకు తీసికట్టుగా మారింది. ఇటీవలే ఈ కాలువకు నీటిని అందించే ప్రాజెక్టు తుంగభద్రలో ఒక గేటు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో ఇప్పుడు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితిపైనా సర్వత్రా చర్చ నడుస్తోంది. ఎందుకంటే ఎప్పుడో నిర్మించిన ఈ కాలువ నిర్వహణ సరిగా లేక అనంతపురం జిల్లాకు సాగు, తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఆధునీకరణ చేపట్టినా మధ్యలోనే పనులను నిలిపివేయడంతో కాలువ పరిస్థితి మరింత ఆధ్వాన్నంగా మారింది. దీంతో పూర్తి సామర్థ్యంతో నీటిని కూడా తీసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. 1800 క్యూసెక్కుల్లోపే నీరు జిల్లాకు వస్తోంది. ఒకవైపు వృథాగా నదిలోకి పోతున్నా అదనంగా నీరు తీసుకోలేకపోతున్నాం. అది కూడా బిక్కుబిక్కుమంటూనే తీసుకోవాల్సి వస్తోంది.

తక్షణ మరమ్మతులకు రూ.35 కోట్లు అవసరం ?

హెచ్ఎల్ఎంసి పూర్తి ఆధునీకరణ కాకున్నా ఒక మోస్తర నీటిని తీసుకోవాలంటే కూడా తక్షణం రూ.35 కోట్లు మరమ్మతులకు అవసరమవుతాయని హెచ్ఎల్ఎంసి అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో ప్రధానంగా రెగ్యులేటరీలే మూడున్నాయి. కణేకల్ చెరువు వద్ద, పిఎబిఆర్, మిడ్పెన్నార్ ఇలా మూడు ప్రధానమైన చోట్ల కూడా రెగ్యులేటరీలు దెబ్బతిన్నాయి. 137వ కిలోమీటరు వద్ద అండర్ టన్నెలు మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. 115వ కిలోమీటరు నుంచి 130 కిలోమీటరు మధ్య కాలువ పూర్తిగా దెబ్బతిని ఉంది. దీనికి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఇవి కాకుండా ఇంకా అనేక పనులున్నప్పటికీ హెచ్ఎల్ఎంసి అధికారులు ఈ పనులను ఇంకా పరిగణలోకి తీసుకోలేదు. ప్రధానంగా పిఎబిఆర్ లింక్ కెనాల్ ప్రవాహ సామర్థ్యం తక్కువగా ఉండటమే కాకుండా ఉన్నది కూడా సరిగా లేదు. ఇక బొమ్మనహాల్ నుంచి కణేకల్ మధ్య సుమారు 17 వరకు బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరాయి. అటువైపు వాహనాలుగానీ, మనుషుల రాకపోకలుగానీ చేయలేని పరిస్థితి ఉంది. ప్రధానంగా పొలాలకు వెళ్లాలంటే రైతులు పది నుంచి 20 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఈ పనులను ఈ అంచనాల్లో రూపొందించలేదు.

కొత్త ప్రభుత్వం దృష్టి సారించేనా ?

గత ప్రభుత్వ హయాంలో ఈ పనులను పూర్తిగా నిలిపేశారు. ఈ మేరకు ఆధునీకరణ పనులను రద్దు చేస్తూ ఉత్వర్వులిచ్చారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఈ జీవోను రద్దు చేస్తామని ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో ఆధునీకరణ పనులు చేపడతారా.. లేదా.. అన్న దానిపై స్పష్టతనివ్వలేదు. కాలువల ఆధునీకరణకు అధికారులు అంచాన వేసిన మేరకు కనీసం తక్షణ మరమ్మతులకు అవసరమైన రూ.35 కోట్లు అయినా విడుదల చేస్తుందా.. లేదా.. అన్నది చూడాల్సి ఉంది. మరోవైపు సాగునీటి ప్రాజెక్టులపై సిపిఎం ఈనెల బస్సు యాత్రను చేపట్టింది. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుయకు ఈ పోరాటానికి సిద్ధమైంది.

ఉపాధి కూలీ కుటుంబాన్ని ఆదుకోండి: సిఐటియు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఎన్ పి కుంట మండలం గౌకనపల్లిలో ఉపాధి పనులకు వెళ్లి మృతిచెందిన కూలీ కుటుంబాన్ని ఆదుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ ఉపాధి పని చేస్తూ పని ప్రదేశంలోనే ప్రాణాలు వదిలారని, ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతిత్రాన్ని పీడీ విజయేంద్ర ప్రసాద్ కు జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించి నిర్మాణ కార్మికులుగా నమోదు కార్యక్రమం చేపట్టి తద్వారా వచ్చే జీవిత బీమా, సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో చనిపోతున్న ఉపాధి కూలీలను అనాథ శవాలుగా గుర్తిస్తున్నారని కరువు జిల్లాగా పేరుగాంచిన ఈ ప్రాంతంలో ఉపాధి హామీ కూలీలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ మస్తాన్ బి కుటుంబాన్ని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిబంధనల మేరకు ఆదుకోవాలని కోరారు. తక్షణ సహాయం కింద 50 వేల రూపాయలు, ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు 25 లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సాకే వెంకటేశులు, రమాదేవి , ఆఫీస్ బేరర్ కార్యదర్శి సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోండి

సదస్సులో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నవీన్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ నవీన్ కుమార్ అన్నారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం పట్టణంలోని రోటరీ క్లబ్లో వన్ టౌన్ సిఐ రాజగోపాల్ నాయుడు అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి పెనుగొండ సబ్ కలెక్టర్ నవీన్ కుమార్, హిందూపురం తహశీల్దార్ వెంకటేష్ హజరయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ 2005 అక్టోబర్ 12వ తేదీన రాష్ట్రపతి ఆమోదంతో సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. సామాన్యుల చేతుల్లో సమాచారాన్ని ఉంచడం చట్టం ముఖ్య ఉద్దేశం అన్నారు. సమాచారం గురించి అడిగితే 30 రోజుల్లోపు అధికారులు అందించాలన్నారు. ఈ చట్టం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాల్సి ఉందన్నారు. చట్టం ఆవశ్యకతను ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఈ చట్టం ద్వారా సామాన్యులు సైతం ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ సమాచారాన్ని అయినా అడిగి తెలుసుకోవచ్చన్నారు. ఈ చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సమాచార హక్కు చట్టం కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎవరి కోసం దుకాణాల దరఖాస్తు గడువు పొడిగింపు .?

ప్రజాశక్తి - అనంతపురం

టిడిపి, జనసేన, బిజెపి నాయకుల మధ్య సర్దుబాటు కోసమే ప్రభుత్వం మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించిందని ఉరవకొండ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి ఆరోపించారు. గురువారం జిల్లాకేంద్రంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ ప్రవేశపెట్టిన మద్యం విధానంలో మార్పులు, చేర్పులు చేస్తోందన్నారు. తద్వారా క్రైమ్ రేట్ మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చెయ్యకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తోందన్నారు. ఇకనైనా హామీలఅమలుపై దృష్టి సారించాలని హితవు పలికారు.

వికలాంగులకు చేయూతనివ్వాలి

అనంతపురం కలెక్టరేట్ : వికలాంగులు స్వశక్తితో సమాజంలో ముందుకు సాగేలా వారికి చేయూత నివ్వాలని వృద్ధులు, వికలాంగులు, హిజ్రాల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.అబ్దుల్రసూల్ పిలుపునిచ్చారు. ఎన్కేసీ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం జిల్లా వికలాంగులు, హిజ్రాల సంక్షేమ శాఖ కార్యాలయంలో పేద వికలాంగుడు బాషాకు త్రిచక్ర వాహనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎడి మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటూ, స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో అన్నిరంగాల్లో వెనుకబడిన వికలాంగులు, అనాథ వృద్ధులు, హిజ్రాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎన్కేసీ సేవా సమితి ప్రధాన కార్యదర్శి కమల్నాథ్ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మహాబోధి కృష్ణమూర్తి, ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ అధ్యక్షులు కెపి.రాజు, కళాకారుడు, పాత్రికేయులు తోట నాగరాజు, కె.అనిల్కుమార్రెడ్డి, తరిమెల రాజు, శంకర్రెడ్డి పాల్గొన్నారు.

పుడా వైస్చైర్మన్గా జేసీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి పట్టణాభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్గా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ను ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. రాష్ట్రంలోని 14 పట్టణాభివృద్ధి సంస్థల్లో వైస్ చైర్మన్ల నియామకం బాధ్యతలను అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా జాయింట్ కలెక్టర్ అభిషేక్కుమార్ను పుడా వైస్ చైర్మన్గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పుడా డిప్యూటీ డైరెక్టర్ మల్లయ్య, ఏవో.నర్సారెడ్డి,టి పిఎ రేవాపతి, ప్లానింగ్ సెక్రటరీ అనిల్ కుమార్ గురువారం జిల్లా కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ ను కలిసి పుష్ప గుచ్చాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు వైస్ చైర్మన్గా జేసీ కొనసాగుతారని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

జేసీకి పుష్పగుచ్చం అందజేస్తున్న అధికారులు

కొనసాగిన ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం ఆర్టీసీ డిపోలో పెంచిన పని భారాలకు నిరసనగా నాలుగురోజులుగా ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న నిరసన ఐదవ రోజు గురువారం కొనసాగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదురోజులుగా నిరసన తెలుపుతున్నా డిపో మేనేజర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గురువారం చర్చలు పేరిట యూనియన్ నాయకులను పిలిచి మొక్కుబడిగా మాట్లాడి పంపారని విమర్శించారు. తమ సమస్యలు పరిష్కరించేదాకా నిరసనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ యూనియన్ జిల్లా నాయకులు కెబి. నాగార్జున రెడ్డి, కార్యదర్శి ముస్తఫా, ఎడిసి మల్లికార్జున, టిఎస్. మూర్తి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

'చెత్తతో సంపద' శూన్యం

నిరుపయోగంగా చెత్తతో సంపద తయారీ కేంద్రాలు

వర్మీకంపోస్టును ప్రయివేటులో కొంటున్న రైతులు

మూలన పడ్డ చెత్తతరలింపు వాహనం

నిరుపయోగంగా వర్మికంపోస్టు తయారీ యంత్రం

ప్రజాశక్తి-పెనుకొండ

గతంలో తెలుగుదేశం ప్రభుత్వం పంచాయతీల్లో సేకరించిన చెత్త నుంచి వర్మీకం పోస్టును తయారు చేసి రైతులకు తక్కువ ధరకు అందించాలనే ఉద్దేశ్యంతో రూ.కోట్లు వెచ్చించి సంపద సృష్టి కేంద్రాలు నిర్మించింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం శ్రద్ధ చూపక దానిని నిర్వీర్యం చేసింది. రూ. లక్షలు ఖర్చు చేసి నిర్మించిన షెడ్లు ప్రస్తుతం దిష్టిబొమ్మల్లా మారాయి. ఫలితంగా రైతులు పండ్లు, కూరగాయల సాగు పంటలకు సేంద్రియ ఎరువులను ప్రయివేటుగా కొనుగోలు చేస్తూ వ్యయ భారాన్ని మోయాల్సి వస్తోంది. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో రైతులు మేలు, పంచాయతీలు ఆదాయం కోల్పోయాయి. అప్పటి ప్రభుత్వ ఈ లక్ష్యాన్ని నీరుగార్చింది. ఐదేళ్ల తర్వాత అధికారంలోకి తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంపద సృష్టి కేంద్రాలకు పునరుజ్జీవనం పోస్తారన్న ఆశాభావనం రైతుల్లో వ్యక్తమవుతోంది. నాడు టిడిపి హయాంలో పంచాయతీల్లో చెత్త సేకరణకు క్లాప్ మిత్ర, షెడ్‌మిత్రల నియామకం చేపట్టారు. ఇళ్లలోని తడి, పొడి చెత్తలకు బుట్టలు అందించారు. చెత్త సేకరణకు రిక్షాలు, ఆటోలు, ట్రాక్టర్లు వంటి వాహనాలను పంచాయతీలకు ఇచ్చారు. చెత్త సేకరణ చేస్తున్నా ఫలితం మాత్రం శూన్యం.

నీరుగారిన ప్రభుత్వ లక్ష్యం

ప్రతి పంచాయతీకి ఒక చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని ప్రభుత్వం నిర్మించింది. వెయ్యిమందికి ఒక క్లాప్ మిత్ర(హరితరాయబారి),ఒక ట్రైసైకిల్ మంజూరు చేసింది. వీటితో పాటు పెద్ద పంచాయతీలకు ట్రాక్టర్లు, ఇంటింటికి బుట్టల పంపిణీ పంపిణీ చేసింది. క్లాప్‌మిత్రల ఇంటింటి వద్దకు వెళ్లి ట్రైసైకిల్ ద్వారా చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలి. అక్కడ తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి సేంద్రీయ ఎరువు (వర్మీకంపోస్టు) తయారు చేసి, రైతులకు విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయం పంచాయతీల అభివృద్ధికి వినియోగించాలనే ప్రభుత్వం ఉద్దేశం.

దిష్టిబొమ్మల్లా సంపదసృష్టి కేంద్రాలు

లక్షల రూపాయలు వెచ్చించి చెత్తతో సంపద సృష్టి కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేసి ఆరేళ్ల దాటినా కొన్ని చోట్ల ఇంత వరకు వాటిని పట్టించుకున్న పాపాన పోలేదు. నాటి పాలకులు, అధికారులు సంపద సృష్టి కేంద్రాలకు వెళ్లిన దాఖలాలు లేవు. వాటిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.ఉన్నతాధికారులకు చూపించడానికి ఒకటి,రెండు కేంద్రాల్లో సేంద్రీయ ఎరువు ఉత్పత్తి చేస్తున్నారు. సేంద్రీయ ఎరువుల ఉత్పత్తిపై రైతుల్లో అవగాహన కల్పించడంతో అధికారులు విఫలం కావడంతో విక్రయాలు జరగడం లేదు.

వర్మీ కంపోస్టు ప్రయివేటుగా కొనుగోలు

పండ్లతోటలు, కూరగాయలు వంటి పంటలకు సేంద్రీయ ఎరువుల ఉపయోగం అధిమైంది. ప్రయివేటు వ్యక్తులు తయారు చేసే వర్మీ కంపోస్టును అధిక ధరకు కొనుగోలు చేసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పంచాయతీల్లోనే వర్మీకంపోస్టు అందుబాటులో ఉంటే వారికి రవాణఖర్చులు, ఇతర వ్యయం మిగులుతుంది. ప్రభుత్వం అందించే కంపోస్టు రైతులకు అందుబాటు ధరలోనే ఉంటుంది.

శ్రీసత్యసాయి జిల్లాలో 467 పంచాయతీల్లో 416 సంపద సృష్టి కేంద్రాలు, 768 మంది క్లాప్, షెడ్ మిత్రలు ఉన్నారు. పెనుకొండ డివిజన్ పరిధిలో 164 పంచాయతీల్లో 152 సంపద సృష్టికేంద్రాలు, 533 క్లాప్ మిత్రాలున్నారు. పంచాయతీల జనాభాతో పాటు షెడ్డు కొలతలు బట్టి ఒక్కో కేంద్రం నిర్మాణానికి రూ.3.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ప్రభుత్వం కేటాయించింది.

నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రం

దీంతో నిర్మాణాలు పూర్తి చేశారు. అనంతరం సంపద సృష్టిపై దృష్టి సారించనేలేదు.

నిరుపయోగంగా యంత్రాలు..

లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన యంత్రాలు నిరుపయోగంగా మారాయి. ఉపయోగించకపోవడంతో తుప్పుపట్టి పోతున్నాయి. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి వాటిని వర్మీ కంపోస్టు గా మార్చే ప్రక్రియలో ఈ యంత్రాలు ఉపయోగపడతాయి. అధికారులు,పాలకుల నిర్లక్ష్యం వల్ల యంత్రాలు తుప్పపట్టిపోతున్నాయి.

పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలి

నిరుపయోగంగా ఉన్న సంపదసృష్టి కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగం లోకి తీసుకు రావాలి. డంపింగ్ యార్డుల్లో చెత్త వేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం అడుతున్నారు. తడి, పొడి చెత్త వేరు చేసి వర్మీకంపోస్టు తయారు చేయడం వల్ల రైతులకు మేలు జరుగుతుంది. ప్రజల ఆరోగ్యం సురక్షితంగా ఉంటుంది. కంపోస్టు ఎరువు రైతులకు ఉచితంగా ప్రభుత్వం అందించాలి.

హరి,
సిపిఎం నాయకులు

భార్య చేతిలో భర్త హతం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం మండలం ధర్మపురి గ్రామంలో భార్య చేతిలో భర్త హతమయ్యాడు. గ్రామానికి చెందిన గోవిందు (56)ను భార్య అంజినమ్మ గురువారం రోకలి బండతో తలపై కొట్టి హతమార్చింది. ఈ ఘటనకు సంబందించి గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గోవిందు, ఆయన భార్య అంజినమ్మ వ్యవసాయ పనులు చేసుకుంటే జీవనం కొనసాగించేవారు. వారికి ఒక కూతురు సంతానం. ఈ నేపథ్యంలో గోవిందు మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించేవాడు. ఇది గమనించిన భార్య అంజినమ్మ పద్ధతి మార్చుకోవాలని పలుమార్లు గోవిందుకు తెలిపింది. ఈ నేపథ్యంలో గురువారం భార్య, భర్త ఇంటిలో గొడప పడ్డారు. ఈసందర్భంగా అంజినమ్మ రోకలిబండతో గోవిందు తలపై కొట్టింది. దీంతో గోవిందు మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలోని బోయినపల్లి తండా సమీపాన గల ఎర్ర కొండ వద్ద గురువారం మధ్యాహ్నం పేకాట ఆడుతుండగా సిఐ శేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించి 14 మందిని అదుపులో తీసుకున్నారు. వారి వద్ద నుండి 1, 03,325 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ శేఖర్ తెలిపారు అలాగే 10 మోటార్ సైకిల్‌ను సీజ్ చేసి కేస్ నమోదు చేసినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం రూరల్ మండలం పోతుకుంట పంచాయతీ బందావనం కాలనీకి చెందిన బాలుడు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. గ్రామానికి చెందిన బాబు అనే వ్యక్తి కుమారుడు ఆరేళ్ల జయంత్ కాలనీ వద్ద రోడ్డు దాటుతుండగా మామిళ్ళపల్లి వైపు నుంచి ధర్మవరం వైపు వస్తున్న ద్విచక్ర వాహనం బాలుడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలుడికి ఎడమ కాలుకి తీవ్రమైన గాయమైంది. కుటుంబ సభ్యులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జయంత్ స్థానిక ప్రియదర్శిని పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు.

పాముకాటుతో యువకుడు మృతి

ప్రజాశక్తి - నల్లచెరువు

మండల పరిధిలోని జోగన్న పేట పంచాయతీకి చెందిన యువకుడు పాముకాటుతో మృతిచెందాడు. రాట్నాలపల్లి లో నివాసం ఉండే విశ్వనాథ్ రెడ్డి వ్యవసాయ పనులు చేస్తూ ఉండగా పాము కాటుకు గురయ్యాడు. గమనించిన స్థానికులు కదిరి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే విశ్వనాథరెడ్డి మతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య ఉంది. విశ్వనాథ్ రెడ్డి మృతితో జోగన్న పేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పరిగి ఎంపిడిఓగా శ్రీధర్

ప్రజాశక్తి - పరిగి

పరిగి ఎంపీడీవోగా శ్రీధర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన సరస్వతి హిందూపురానికి బదిలీ కావడంతో పరిగి ఈవోఆర్డీగా పనిచేస్తున్న శ్రీధర్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ అధికారులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు టిడిపి నాయకులు ఆయన సన్మానించారు.

వ్యవసాయ కూలీలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - బత్తలపల్లి

వ్యవసాయ కూలీలను, రైతులను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మండలకేంద్రంలో గురువారం ఆసంఘ సమావేశం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుళ్లాయప్ప అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, ఏపీ చేతి వత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జింక చలపతి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మధు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి వెంకటేష్, అదెప్ప, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అధికారులకు సన్మానం

ప్రజాశక్తి - ఓబుల దేవరచెరువు

మండలంలో పనిచేస్తూ బదిలీపై వెళుతున్న అధికారులను టిడిపి నాయకులు గురువారం సన్మానించారు. బదిలీపై వెళుతున్న సిసిలు శ్రీనివాసులు, భూషణతో పాటు ఎంపిఎ రవీంద్రను ఆనిమేటర్లు టిడిపి నాయకులు సన్మానించారు. గురువారం మండల పరిధిలోని గౌనిపల్లిలో జరిగిన ఈ కార్యక్రమంలో యానిమేటర్లు రమాదేవి, మంజులమ్మ, రామచంద్ర, సుధాకర, మూర్తి, దీపిక, ఉషా, శ్రావణి, హేమవతి, టిడిపి నాయకులు బోయపల్లి శివారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, రాజగోపాల్, డీలర్ శివ నారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్ రాజేష్, పలక గంగన్న, మునిస్వామి, పూజారి సుధాకర తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు

ప్రజాశక్తి-హిందూపురం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. హిందూపురం పట్టణ, పరిసర ప్రాంతాల్లోని దేవాలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని జలదుర్గమ్మ, రేణుక ఎల్లమ్మ, మధుగిరి మారెమ్మ, గాయత్రీ దేవి, అష్టలక్ష్మి దేవాలయం, పేట వెంకటరమణ స్వామి, వేణుగోపాలస్వామి, సూగూరు ఆంజనేయ స్వామి, కొటిపి చౌడేశ్వరి దేవి, ముద్దిరెడ్డిపల్లి పాండురంగ స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగాయి.

కదిరి అర్బన్ : దసరా ఉత్సవాలలో భాగంగా 10వ రోజు గురువారం గాయత్రి మాత దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ప్రధాన అర్చకులు ఆంజనేయ శర్మ, కమిటీ సభ్యులు రామ్మూర్తి శర్మ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తిరుమలలో 'కందికుంట'

ప్రజాశక్తి - కదిరి టౌన్

తిరుమల వెంకటేశ్వర స్వామిని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆయన సతీమణి కందికుంట యశోదమ్మ గురువారం దర్శించుకున్నారు. విఐపి బ్రేక్ సమయంలో వారు దర్శించుకున్నారు.

తిరుమలలో కందికుంట దంపతులు, తదితరులు

వరద బాధితులకు సాయం

మంత్రికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

విజయవాడ వరద బాధితుల సహాయార్థం పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల తరపున రూ.25 లక్షల విలువ జేసే చెక్కును ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, పల్లె రఘునాథ్ రెడ్డి రాష్ట్ర మానవ వనరుల అభివద్ధి శాఖ మంత్రి నారా లోకేష్‌కు గురువారం అందజేశారు. అమరావతిలోని ప్రభుత్వ సచివాలయంలో మంత్రి నారా లోకేష్ ఛాంబర్‌లో ఈచెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,పల్లె రఘునాథ్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వరద బాధితులకు ఆర్థికంగా సాయం అందించిన పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల మేలు ఎన్నటికీ మర్చిపోలేమన్నారు. పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలు వరద బాధితులకు ఇది వరకే గన్నవరం ,మైలవరం నియోజవర్గాల్లో ఉన్న వరద బాధితులకు సుమారు రూ. 50 లక్షలు విలువ చేసే ఆహార ధాన్యాలను అందించిన విషయాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు.

పెనుకొండ : విజయవాడ వరద బాధితులకు పెనుకొండ నియోజకవర్గంలో దాతలు ఇచ్చిన రూ.3.50 లక్షల విలువైన చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంత్రి ఎస్.సవిత గురువారం అందించారు. మంత్రిమండలి సమావేశం అనంతరం సిఎం చంద్రబాబునాయుడుకు మంత్రి చెక్‌ను అందజేశారు. పెనుకొండ పట్టణానికి చెందిన ప్రగతి, రేవతి, బాబా ఫక్రుద్దీన్, దాదా పీర్, బాబా మహిళా గ్రామ సమాఖ్యల్లోని సభ్యులిచ్చిన రూ.1.50 లక్షలు, గోరంట్ల మండలం బూదిలి గ్రామానికి చెందిన భ్రమరాంభిక మహిళా సంఘ సభ్యులు ఇచ్చిన రూ.50 వేలు, ఆంధ్రప్రదేశ్ బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ రూ.లక్ష, పరిగి మండలకేంద్రానికి చెందిన ఇటుక బట్టీ యజమానులు రూ.50 వేలు వరద బాధితుల సహాయార్థం అందించారు.

ముఖ్యమంత్రికి చెక్కు అందజేస్తున్న మంత్రి సవిత

ఎంపీని సన్మానించిన నాయకులు

ప్రజాశక్తి - పరిగి

మండల కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతూ మండల దళిత సంఘాల నాయకులు, టిడిపి నాయకులు హిందూపురం ఎంపీ పార్థసారథిని గురువారం సన్మానించారు. పెనుగొండ పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో ఆయనను కలిసిన నాయకులు సన్మానించారు. పరిగి మండలంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి ఎంపీ నిధుల ద్వారా 50 లక్షలు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. భవనానికి అయ్యే ప్లాన్ సిద్ధం నిధులు మంజూరు అయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేసిన నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోపీ, మోద శివ, నరసింహప్ప, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు మాజీ ఎంపీపీ గోవిందప్ప, మద్దిలేటి, రామాంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

ప్రజాశక్తి - గోరంట్ల రూరల్

ఇంటి నిర్మాణాన్ని జెసిబితో తొలగిస్తున్న దృశ్యం

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ మారుతి హెచ్చరించారు. ఎంపిడిఒ కార్యాలయం పక్కన ప్రభుత్వ భూమి 271-2, 271-4 సర్వే నెంబర్లలోని స్థలంలో అక్రమ నిర్మాణం చేస్తున్నారని గురువారం సమాచారం రావడంతో మేరకు ఆ స్థలాన్ని ఆయన పరిశీలించారు. అక్రమంగా ఇల్లు నిర్మాణం చేసేందుకు ప్రయత్నిస్తుండగా వాటిని జేసీబీ ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇది వరకే అక్రమ నిర్మాణాలు చేసిన వారికి నోటీసులు జారీ చేసి తొలగిస్తామన్నారు.

మానసిక ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరించాలి

ప్రముఖ సైకాలజిస్ట్ వై.సురేష్‌బాబు

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రతి విద్యార్థి శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరించాలని ప్రముఖ సైకాలజిస్ట్ వై.సురేష్‌బాబు సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ ప్రపంచ మానసిక ఆరోగ్య సమాఖ్య సూచనల మేరకు ప్రతి సంవత్సరం అక్టోబర్ 10న మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించు కుంటున్నామన్నారు. పని, సంబంధిత ఒత్తిళ్ల కారణంగా ఎక్కువ మంది ఒత్తిడి, ఆందోళన, నిరాశను అనుభవిస్తున్నందున వారిలో మానసిక ప్రశాంతత క్షీణిస్తోందన్నారు. ప్రశాంతమైన జీవన విధానాన్ని వయసుతో సంబంధం లేకుండా అందరూ అమలు చేయాలని కోరారు. మానసిక ఆరోగ్యంపై అందరికీ అవగాహన తప్పనిసరన్నారు. ఇందులో భాగంగా ఈనెల 11న చిన్న పిల్లలు, టీనేజ్ వారికి, 12న యువతీ యువకులకు, 13న బాలికలు, మహిళలు, 14న విద్యార్థులు, నిరుద్యోగులు, 15న తల్లిదండ్రులు, 16న వయోవృద్ధుల కోసం ఉచిత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా మానసిక ఆరోగ్య సమస్యల పరిష్కారం, ఉచిత కన్సల్టేషన్, కౌన్సెలింగ్ సేవల కోసం హెల్ప్‌లైన్ సెల్.. 80744 25979, 80743 40479 నెంబర్లకు సంప్రదించవచ్చని తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం : ఎస్పీ

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పిల్లలతో మాట్లాడుతున్న తహశీల్దార్ నీలకంఠారెడ్డి

ప్రజాశక్తి - కదిరి టౌన్

జిల్లాలో బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని ఎస్పీ రత్న సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంలో భాగంగా గురువారం కదిరి పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రత్న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి బావితరాల భవిష్యత్తు పౌరులు అని అన్నారు. వారిని తల్లిదండ్రులు బాగా చదివించి ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. అలాగే బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమం నిర్వహిస్తోందని అందులో భాగంగా 52 మంది బాల కార్మికులను గుర్తించడం జరిగిందని అన్నారు. వారందరూ చదువుకునేందుకు ఆర్థిక స్తోమత లేక ఇంటి పరిస్థితులు సరిగ్గా లేక వివిధ కారణాలతో వివిధ రకాల పనులకు వెళుతున్నట్లు అధికారులు గుర్తించారన్నారు. అనంతరం స్వచ్ఛంద సంస్థ సహకారంతో పిల్లలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి శివ నారాయణస్వామి, సిఐలు నారాయణరెడ్డి, మోహన్, ఎస్ఐలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శ్రీనివాస్ నాయుడు, కార్మిక శాఖ అధికారి, పోలీస్, స్వచ్ఛంద సంస్థ సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : జిల్లావ్యాప్తంగా 'ఆపరేషన్ స్వేచ్ఛ' కార్యక్రమాన్ని నిర్వహించాలని మైనర్లను పనిలో ఉంచుకోవడం నేరమని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు, మహిళా పోలీసులు, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పట్టణ ప్రాంతాల్లో పరిశ్రమలలో, మోటర్ మెకానిక్ షాపులు, గుజరి షాపులు, కిరాణా షాపుల వద్దకు వెళ్లి 14 సంవత్సరముల లోపు బాలురు పనిచేయుట నేరమని సూచించారు. గోరంట్ల పట్టణంలో సి ఐ శేఖర్, తన సిబ్బందితో పాటు ఐసిడిఎస్ సిబ్బందితో కలిసి వెళ్లి గుజిరి షాపులో పనిలో పెట్టుకున్న 14 మంది పిల్లలకు ముక్తి కలిగించారు. అదేవిధంగా పుట్టపర్తి, ఆమడగూరు, కదిరి,మడకశిర పెనుగొండ తదితర ప్రాంతాలలో పోలీస్ అధికారులు, ఐసిడిఎస్, స్వచ్ఛంద సంస్థల సిబ్బందితో కలిసి వెళ్లి ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమం నిర్వహించారు.

కొత్తచెరువు : 14 సంవత్సరాల వయస్సు లోపల చిన్నారులను పనుల్లో ఉంచుకుంటే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ నీలకంఠారెడ్డి, సిఐ ఇందిర హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆపరేషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పోలీసులు ఐసిడిఎస్ అధికారులు రెవిన్యూ సిబ్బంది కొత్త చెరువులో కిరాణా షాపులు, మెకానిక్ షాపులు, హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో ప్లాస్టిక్ బాటిళు ,,వస్తువులు ఏరుకొని చిన్నారులను ఐదుగురిని గుర్తించారు వారిని, వారి తల్లిదండ్రులను తహశీల్దార్ వద్ద హాజరు పరిచారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను స్కూల్లో చదివించాలని ఇలా వదిలిపెట్టడం మంచిది కాదని సూచించారు. అనంతరం ఆ చిన్నారులను వారి తల్లిదండ్రులకు అప్పగించారు మైనర్లను ఎవరైనా పనుల్లో పెట్టుకుంటే చట్టరీత వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పుష్పలత, అంగన్వాడి కార్యకర్త పద్మావతి, డిప్యూటీ తహశీల్దార్ బాలాంజనేయులు, పోలీసులు పాల్గొన్నారు.

కూలిన ఇళ్లు

ప్రజాశక్తి - అగళి

మండలంలోని ఇరిగేపల్లి, నందరాజనపల్లిలో రెండు ఇళ్లు కూలిపోయాయి. ఇరిగేపల్లి ఎస్సీ కాలనీలో లలితమ్మ ఇల్లు కూలిపోయింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి ఇల్లు మొత్తం నిమ్ము తీసుకోవటంతో ఎప్పుడు కూలుతుందోనన్న భయంతో లలితమ్మ తన ఇద్దరు పిల్లలతో బయట పడుకుంది.ఈ సందర్భంగా బుధవారం రాత్రి ఒక్కసారిగా ఇల్లు కూలిపోయింది. ఆసమయంలో లలితమ్మ, ఇద్దరు పిల్లలు బయట పడుకోవటంతో ప్రాణాలతో బయటపడ్డారు. అదే విధంగా నందరాజనపల్లిలో కూడా ఒంటరిగా ఉన్న వృద్ధురాలు గొల్ల తిమ్మక్క ఇల్లు కూడా బుధవారం రాత్రి కూలిపోయింది. విషయం తెలుసుకున్న సర్పంచి లక్ష్మి లింగరాజు, మాజీ సింగల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, మంజు చరణ్ హరీష్ బాధితులను పరామర్శించారు. సమస్యను ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

బాధితుడికి పరామర్శ

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన కురుబ శ్రీరాములు నెల రోజుల క్రితం ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి పడి ప్రమాదానికి గురయ్యాడు. బెంగళూరు లో చికిత్స అనంతరం రెండు రోజుల క్రితం తన అక్కగ్రామం రాచూరుకు వచ్చారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ ఎం.నరహరి, పెనుకొండ నియోజకవర్గ బీసీ సెల్ అధికార ప్రతినిధి జి.రాము, స్థానిక నాయకులు మాజీ డీలర్ వెంకారెడ్డి, ఆర్ఎంపి చెన్నకేశవ, టిడిపి నాయకులు నరసింహారెడ్డి, కె. నాగేంద్ర, లోచర్ల హనుమంతు తదితరులు శ్రీరాములును పరామర్శించారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైం

ఎస్సీ, ఎస్టీ కేటగిరీకి చెందిన పేద నిరుద్యోగులు డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమయ్యేందుకు ఉచిత శిక్షణకు దరఖాస్తుచేసుకోవాలని ఎస్‌డబ్ల్యూఒ శివరంగప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థికంగా, నైతికంగా చేయూత అందించేందుకు డీఎస్సీ పరీక్షలో సత్ఫలితాలు పొందేందుకు సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ద్వారా 5050 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ శిక్షణ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేయబడిన శిక్షణ సంస్థలలో సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్స్ లో నిర్వహించబడుతుందని అన్నారు. మరిన్ని వివరాలకు పుట్టపర్తి పట్టణంలోని దీన జనోద్ధరణ భవనంలోని బ్లాక్ నెం.5లో గల ఎస్సీ వెల్ఫేర్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రతన్ టాటా మృతి తీరనిలోటు

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

టాటా చిత్రపటానికి ఎంపీ, తదితరుల నివాళి

రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు అని హిందూపురం ఎంపీ బికె. పార్థసారథి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుకొండ : ప్రముఖ పారిశ్రామికవేత్త, టాటా గ్రూప్ చైర్మన్ రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు అని తెలుగు దేశం నాయకులు అన్నారు. గురువారం పట్టణంలోని అన్నా క్యాంటీన్ లో రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు శ్రీరాములు, నంజుండ, వాసుదేవ రెడ్డి, బాబిరెడ్డి, మాధవ రెడ్డి, చెన్నరాయుడు, అంజనప్ప, వడ్డీ మురళీ, సాయి రమేష్, గోపాల్, శివానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు అనిటిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి పట్టణంలోని హనుమాన్ సర్కిల్ లో రతన్‌టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

14 నుంచి 'పల్లె పండుగ'

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ఉపాధి హామీ పథకం, 15 వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామ సభల్లో ఆమోదం పొందిన పనులకు పంచాయతీల వారీగా ప్రారంభించే చర్యల్లో భాగంగా ఈనెల 20 వరకు పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సాయి మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ఇరవై గ్రామ పంచాయతీలలో 14 తేదీ ఉదయం పదిగంటలకు పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. గొట్లూరు పంచాయతీలో ఈ కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా ధర్మవరం ఎమ్మెల్యే, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, హిందూపురం ఎంపీ పార్థసారథి హాజరవుతున్నాయని తెలిపారు. జిల్లా ప్రాదేశిక సభ్యులు, మండల ప్రాదేశిక సభ్యులు, ఇతర నాయకులు, సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ కోరారు.